క్లుప్తంగా

ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయం నిర్మించి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించడం శుభ పరిణామం అన్నారు. ఆలయాల అభివద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, అర్జున్, రాములు, భాస్కర్, శ్రీకాంత్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలకు రూ.4వేలు ప్రోత్సాహం

ఎంపీడీఓ హరినందనరావు

మునిపల్లి(అందోల్): కొత్తగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకంద్వారా సుమారు రూ.4.040 మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ హరినందనరావు ఆదివారం తెలిపారు. ఇంకుడు గుంతలు లేనివారు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గుంతలు ఏర్పాటు చేసుకుంటే వాటిని పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి మండల, జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తే నిధులు మంజూరవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులకు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటరు చైతన్యానికి బెలూన్‌తో ప్రచారం



మినీస్టేడియంపై ఏర్పాటు చేసిన బెలూన్

నారాయణఖేడ్: అర్హులందరూ తమ ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా బెలూన్‌లతో ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఆర్డీఓ అశోకచక్రవర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పట్టణంలోని మినీస్టేడియంపై నినాదాలతో కూడిన బెలూన్‌ను గాలిలో ఎగురవేశారు. ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే వారు బెలూన్‌ను ఆసక్తిగా తిలకించారు.

జనజాతర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: జనజాతరను జయప్రదం చేయాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే మహనీయుల జనజాతరను విజయవంతం చేయాలని కోరారు. 23న అంబేడ్కర్ భవన్ లో జరిగే జిల్లా సదస్సులో పాల్గొనాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఖయ్యూం, నాగభూషణం, కేయూపీఏ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లేశం, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలలో గెలిపించాలి

ఎంపీ అభ్యర్థి నీలం మధు



నీలం మధును సన్మానిస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: ఎంపీ ఎన్నికలలో తనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పీజేఆర్ కాలనీ వాసులను కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ మద్దతును ప్రకటించారు. అనంతరం మధు కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. కాలనీవాసులు నాగేంద్ర, రంజిత్, మణికుమార్, వంశీ బాలాజీ, రాజా, సురేశ్, రవి వర్మ, అశోక్, గోపాల్, జగదీశ్, రవిచంద్ర శాస్త్రి, భాస్కరరావు, హరీశ్, కోటేశ్వరరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల సముదాయం సొసైటీకి ఆదాయం

- రూ.కోటితో 20దుకాణాల నిర్మాణం
- డీసీఎంఎస్‌కు రూ.2లక్షల రాబడి
- వ్యాపారులకు ప్రయోజనం

జహీరాబాద్ నడిబొడ్డున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)కి చెందిన దుకాణాలు వినియోగంలోకి వచ్చాయి. వాటి వల్ల సొసైటీకి సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం లభించింది. వ్యాపారులకు కూడా ప్రయోజనం కలిగింది.



ఇటీవల ప్రారంభించిన దుకాణాల సముదాయం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో డీసీఎంఎస్‌కు రూ.కోట్ల విలువ చేసే 1.30ఎకరాల స్థలంలో 55 సంవత్సరాల క్రితం రైస్ మిల్, గోదాంలు నిర్మించారు. అవి వాడుకలో లేకపోవడం వల్ల శిథిలమయ్యాయి. పైకప్పు, గోడలు, తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. అయితే ఆ స్థలంలో దుకాణాల సముదాయం నిర్మిస్తే ప్రయోజనంగా ఉంటుందని కొన్నేళ్ల నుంచి కొందరు డిమాండ్ చేస్తున్నారు. కాని సంబంధిత అధికారులు సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో ఆ స్థలం నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

దృష్టి సారించిన చైర్మన్ శివకుమార్

జహీరాబాద్‌కు చెందిన సినీ నిర్మాత, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.శివకుమార్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా ఎన్నికయ్యాక ఈ స్థలాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు దృష్టిసారించారు. శిథిలావస్థకు చేరిన గోదాం ఇతర కట్టడాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. రూ.10కోట్లతో బహుళ అంతస్తుల్లో సుమారు 84 దుకాణాలు, రైతు సేవా కేంద్రం, రైతు శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపారు. గత సంవత్సరం మార్చి నెలలో అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. మొదటి విడతగా రూ.1.04కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 20దుకాణాలు, రైతు సేవా కేంద్రం నిర్మించారు. ఇటీవలే ఈ దుకాణాలను ప్రారంభించి వ్యాపారులకు కేటాయించారు. తక్కువ ధరకే దుకాణాలు లభించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని విధాలుగా ప్రయోజనం



డీసీఎంఎస్ స్థలంలో దుకాణాల సముదాయం నిర్మాణం వల్ల అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరనుంది. స్థలం వినియోగంలోకి రాగా సొసైటీకి కూడా ఆదాయం పెరిగింది. అలాగే వ్యాపారులకు కూడా లబ్ధిచేకూరుతోంది. రైతు సేవా కేంద్రం ఏర్పాటు వల్ల రైతులకు ఎరువులు తక్కువ ధరకు దొరుకుతున్నాయి.

–ఎం.శివకుమార్, జిల్లా డీసీఎంఎస్ చైర్మన్

వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు కృషి

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి మశ్చందర్



నారాయణఖేడ్: పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మశ్చందర్

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటే తన లక్ష్యమని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎంపీ అభ్యర్థి గురప్ప మశ్చందర్ అన్నారు. అంత్వార్ శివారులో ఆదివారం ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడం, దళారీవ్యవస్థ, కల్తీ విత్తనాలు, పురుగుమందులు, సాగునీటి వసతిలోటు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాలకులు పార్లమెంటులో ఓటు బ్యాంకు పదిలపర్చుకునే బిల్లులు తీసుకువస్తున్నారే తప్ప పేదలకు అవసరమైనవి తేవడంలేదని ఆరోపించారు. పేదరిక నిర్మూలన, ఉచిత విద్య, ఉచిత కార్పొరేట్ వైద్యం తదితర బిల్లుల ఆవశ్యకత ఉందన్నారు. కల్హేర్ మండలం మార్డికి చెందిన తాను 17ఏళ్లుగా అమెరికాలో ఉండి ఈ దేశంలో పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఎంపీగా పోటీచేస్తున్నట్లు తెలిపారు. 23న నామినేషన్ దాఖలు చేయనున్నానని సింహం గుర్తుకు ఓట్లువేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కల్హేర్ ఎంపీపీ గురప్రసుశీల, నాయకులు బస్వరాజ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్ధేశ్వర, వీరభద్రేశ్వరుని జాతర



ఝరాసంగం(జహీరాబాద్): సిద్ధేశ్వర స్వామి




న్యాల్‌కల్(జహీరాబాద్): వీరభద్రేశ్వర స్వామి

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని పొట్టిపల్లి శివారులో ఉన్న సిద్ధేశ్వరస్వామి జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం పల్లకి సేవ, బుధవారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వీరభద్రేశ్వర స్వామి జాతర..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెరియంపూర్ గ్రామ సమీపంలో గల వీరభద్రేశ్వ స్వామి దేవాలయంలో సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మూడు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 22న స్వామి వారికి పాదపూజ, పల్లకి సేవ, ఉట్టికొట్టే కార్యక్రమం, 23న ఉదయం 5 గంటలకు సిద్దయ్యస్వామిచే రుద్రాభిషేకం, పల్లకి ఉత్సవం, బీచ్‌కుంద మఠాధిపతి సోమలింగ శివాచార్య, డాక్టర్ రాజశేఖర్ శివాచార్యులచే ప్రవచన కార్యక్రమం, 24న రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

చీడపీడల నివారణతోనే అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కంది(సంగారెడ్డి): చీడపీడల నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు చెప్పారు. కంది మండలంలోని మక్తఅల్లూర్‌లో నిర్వహిస్తున్న జాతీయ సేవాపథకంలో భాగంగా ఆదివారం కూరగాయల పంటలకు సోకే చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పంటలకు చీడపీడలు సోకకుండా ఉండేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు సేంద్రియ ఎరువులను వినియోగించాలని, ఈ విధానంలో దిగుబడి కూడా అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్పకు బోనాలు

ఉత్సవాల్లో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్



బోనాలతో వెళ్తున్న శివకుమార్ తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని గుంత మర్పల్లి గ్రామంలో బీరప్పస్వామి జాతర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి బోనాలు ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల నత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ భక్తిశ్రద్ధలతో బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, కేతకి ఆలయ మాజీ చైర్మన్ నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అనురాధ(ఫైల్)

కంది(సంగారెడ్డి): మహిళ అదృశ్యమైన ఘటన కందిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం.. కందికి చెందిన చిట్కుల సాయిలు బాలాజీ ఆసుపత్రిలో వార్డుబాయ్‌గా పని చేస్తున్నాడు. భార్య అనురాధ(40)తో కలిసి కందిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గత 14న సాయిలు విధులకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి తలుపు తాళంవేసి ఉంది. దీంతో భార్య అనురాధ ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి ఇంటింటాతిరిగి ప్రజలకు వివరించారు. పథకాల అమలును చూసి ఓటేయాలని విజ్ఞప్తిచేశారు.

బీబీ పాటిల్‌ను గెలిపించాలి..

జహీరాబాద్ టౌన్: బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు దుర్గయ్య కోరారు. మండలంలోని బుర్దిపాడ్ గ్రామంలో ఆదివారం పార్టీ కార్యాలయం ప్రారంభించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కిష్టన్న, అమ్రేశ్, అంజి, బ్రదీనాథ్, సంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొగుడంపల్లి మండలంలోని విట్టునాయక్ తండా, గౌసాబాద్ తండాకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో వీరారెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ గురప్ప సుశీల అంజయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

విజేతలకు అవార్డులు

సంగారెడ్డి టౌన్: కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్యోతిర్వాస్తు విద్యా పీఠంలో వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ ఆదివారం అవార్డులు అందజేశారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవడం అభినందనీయమని చెప్పారు. 212 మంది విద్యార్థులకు అవార్డులు అందించినట్లు తెలిపారు.

ఘనంగా మహావీర్ జయంతి

పటాన్‌చెరు టౌన్: మహావీర్ జయంతి జైన సమాజానికి ఇష్టమైన పండుగ అని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం మహావీర్ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ఉన్న మహావీర్ విగ్రహానికి నివాళులర్పించారు. జలగరీ ఎట్టయ్య, బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ అజ్మత్ పాల్గొన్నారు.

వైభవంగా మహాదేవుని ఉత్సవాలు

కంగ్టి (నారాయణఖేడ్): మండలంలోని గాజులపాడు గ్రామంలో మహాదేవుని ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామం మధ్యలో ఉన్న ఉత్సవ విగ్రహాలను మహాదేవుని ఆలయంలోకి ఆదివారం ఊరేగింపుగా తరలించారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు దొందుదొందే..

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అవినీతికి చిరునామాగా పేరొందిన కాంగ్రెస్ పార్టీని, మతోన్మాదం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో ఎంపీపీ దేవానందం ఇంటివద్ద సీనియర్ నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను సాధించి రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ విజయం ఆవశ్యకమని, వెంకట్రామిరెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు పనిచేసి భారీ మెజార్టీ అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సునీత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను వివరిస్తాం..

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడతూ నెరవేర్చలేని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ హన్మత్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ నేతలతో సమావేశం..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ నేతలతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమావేశమయ్యారు. గడ్డపోతారంలో ఆయా గ్రామాల ముఖ్య నేతలతో ఆయన చర్చలు జరిపారు. 27న జరగనున్న కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ఉర్దూ యూనివర్శిటీ ప్రొఫెసర్ సిద్ధిఖీ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సిద్ధిఖీ

జహీరాబాద్ టౌన్: అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని హైదరాబాద్ మౌలానా అజాత్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ ప్రొఫెసర్ సిద్దిఖీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నైపుణాల పెంపుపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు సమకాలీన నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ఆంగ్ల విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ నరహరి మాట్లాడుతూ సెల్ ఫోన్లతో సమయాన్ని వృథా చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అబిద్ మోయిజ్, ఘాస్, ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ, తన్వీర్, కళాశాల అధ్యాపకులు శంకుతల, నాగరాజ్, పర్వీన్, జగన్ మోహన్, ఇర్ఫానా అస్మా, వాజిద్ అలీ, జాన్ నిసార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం



కల్హేర్: సమావేశంలో మాట్లడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నిజాంపేట్ మండలం నాగధర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకుపోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అడివప్ప, నాయకులు గోపి, యం.సాయిలు, రాజు, మల్లయ్య, బాల్‌రెడ్డి, నరేందర్, మున్యనాయక్, గోవిద్, అజయ్ నాయక్, పల్లే అంజయ్య, నాగగౌడ్, విఠల్‌గోండ, మొహినోద్దీన్, సాయిలు, ధన్‌సింగ్, రాములు పాల్గొన్నారు.

అందరూ కృషి చేయాలి: డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ పిలుపునిచ్చారు. 22 నుంచి మండలంలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం హుమ్నాపూర్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో రవీందర్, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్, భూంరెడ్డి, చంద్రన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన జెడ్పీటీసీ

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లోకి..



మంత్రి దామోదర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ వినీల

ఝరాసంగం(జహీరాబాద్): స్థానిక జెడ్పీటీసీ వినీల బీఆర్ఎస్ పార్టీని వీడి సొంతగూటికి చేరారు. ఆదివారం మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీగా గెలిచిన ఆమె గత అసెంబ్లీ ఎన్నికలలో జహీరాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశించి, టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, ఉజ్వల్ ఫౌండేషన్ చైర్మన్ ఉజ్వల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, తన్వీర్, ఉదయ్ శంకర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీబీపాటిల్

జహీరాబాద్ టౌన్: లోకసభ ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి, ఎంపీ.బీబీపాటిల్ హామీఇచ్చారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. మోదీ మూడోసారి ప్రధాని మంత్రి కావడం ఖాయమన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అంజిరెడ్డి పాల్గొన్నారు. మొగుడంపల్లి, కోహీర్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కిరణ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, శ్రీనివాస్, రవికుమార్, రాజమౌళి, మహేశ్, సున్నబట్టి తండా మాజీ సర్పంచ్ ఉమేశ్‌లాల్, మందగుబ్బడి ఉప సర్పంచ్ రూప్‌సింగ్ తదితరులు బీజేపీలో చేరగా బీబీపాటిల్ వారిని ఆహ్వానించారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

జోగిపేట(అందోల్): బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు పులుగు లక్ష్మీబాయి, గాజుల అనిల్ కుమార్, మాజీ కౌన్సిలర్ పి.గోపాల్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు జి.అనిల్ కుమార్, న్యాయవాది నర్సింహులు తదితరులు ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ జోగినాథ్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.